రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకుల దుర్మరణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామ శివారులోని 63వ నెంబర్ జాతీయ రహదారిపై శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే ప్రాణం కోల్పోయారు. కొండగట్టు ఆంజనేయస్వామి దైవదర్శనానికి కారులో వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్లితే.. నందిపేట మండల కేంద్రానికి చెందిన మంద మోహన్(24), గడ్డల రమేష్(36), ఉమ్మెడ అశోక్ (31) ఉదయం కొండగట్టు ఆంజనేయస్వామి దైవ దర్శనానికి కారులో బయలుదేరారు. ఈ క్రమంలో ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామ శివారులోని 63వ నెంబర్ జాతీయ రహదారిపై ఓ లారీని ఓవర్ టేక్ చేసి వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన మరో లారీ వారిని ఢీకొట్టింది. దాంతో ప్రమాద స్థలంలోనే ముగ్గురు మృతిచెందారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉమ్మెడ అశోక్‌కు ఏడాది కిందటే వివాహం అయింది. ఓ బాబు ఉన్నాడు. మందమోహన్ చదువు మధ్యలో ఆపివేశాడు. రమేశ్ కొన్ని నెలల కిందటే గల్ఫ్ నుంచి ఇంటికి వచ్చాడు. ఇతనికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మూడు కుటుంబాల్లో తీవ్ర విషాదం అలుముకుంది.

శిబిరాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్ తమిళిసై

సింక్రోనీ రక్తదాన శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి-హైదరాబాద్

ప్రీమియర్ కన్స్యూమర్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ సింక్రోని రక్తదాన శిబిరాన్ని నిర్వహించింది. రెడ్‌క్రాస్, సత్వా సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని శనివారం రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ లాంచనంగా ప్రారంభించారు. సికింద్రాబాద్‌లోని మిలటరీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రోగులకు మద్దతునందించేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఈ శిబిరంలో 200కు పైగా యూనిట్ల రక్తాన్ని సేకరించడం ద్వారా హాస్పిటల్‌తో పాటుగా తలసేమియా ప్రభావిత చిన్నారులకు మద్దతు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు ఇక్కడ ప్రతి రోజూ 30-40 మందికి ఉచితంగా రక్తం ఎక్కిస్తున్నారు.

మరో 3966 పోలీసు ఉద్యోగాల భర్తీ

- మూడు కమిషనరేట్ల పరిధిలో కొత్త పోలీస్ స్టేషన్లు
- ఆర్అండ్‌బి శాఖలో అధికార వికేంద్రీకరణ
- 472 అదనపు పోస్టులు మంజూరు..
- రోడ్ల మరమ్మతులకు రూ.635 కోట్ల నిధులు
- రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో పలు నిర్ణయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖను మరింత పటిష్టం చేయాలని రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయించింది. మారుతున్న సామాజిక పరిస్థితులతో నేరాల స్వభావమూ మారుతున్న నేపథ్యంలో నేరాల అదుపునకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలనీ, అందుకు అనుగుణంగా సిబ్బందిని నియమించుకోవాలని కేబినేట్ నిర్ణయించింది. ముఖ్యమంత్రి కెసిఆర్ అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రగతిభవన్‌లో సమావేశమైంది. ఐదు గంటలకు పైగా జరిగిన సమావేశంలో కేబినేట్ పరిపాలనాసంబంధ పలు అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకుంది.

నార్కోటిక్ డ్రగ్స్, గంజాయి తదితర మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్‌పై దుష్ప్రభావం చూపుతున్నాయని, వాటిని అరికట్టాలని తెలిపింది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లు, కమాండ్ కంట్రోల్ సెంటర్, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, తెలంగాణ సైబర్ సేఫ్టీ బ్యూరో పరిధిలో 3,966 పోస్టులను వివిధ కేటగిరీలలో భర్తీ చేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి నియామక ప్రక్రియ చర్యలు చేపట్టాలని రాష్ట్ర హోంశాఖను మంత్రిమండలి ఆదేశించింది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో.. శాంతిభద్రతలను మరింతగా మెరుగు పరిచేందుకు, పోలీసు వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని తీర్మానించింది. నూతన పోలీస్ స్టేషన్లు, నూతన సర్కిల్‌లు, నూతన డివిజన్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది.

ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరచాలని నిర్ణయించింది. రోడ్లు భవనాల శాఖను పటిష్టం చేసేందుకు వీలుగా పునర్వ్యవస్థీకరణ చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

అదనపు ఉద్యోగ నియామకాలను చేపట్టాలని, అవసరమైన మేరకు నూతన కార్యాలయాలను ఏర్పాటు చేయాలని,అందుకోసం అదనపు నిధులనూ మంజూరుకు ఆమోదం తెలిపింది. అత్యవసర సమయాల్లో ఆయా స్థాయి అధికారులు స్వీయ నిర్ణయాలు తీసుకుని ప్రజావసరాలకు అనుగుణంగా పనులు చేపట్టేందుకు అవకాశమిచ్చింది.

ఆర్ అండ్ బి శాఖలోని పలు విభాగాల్లో మొత్తం 472 అదనపు పోస్టులను మంజూరు చేసింది. ఇందులో... కొత్తగా 3 చీఫ్ ఇంజనీర్ పోస్టులు., 12 సూపరింటెండెంట్ ఇంజనీర్ పోస్టులు., 13 ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టులు., 102 డిఇఇ పోస్టులు., 163 అసిస్టెంట్ ఇఇ పోస్టులు., 28 డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులతో పాటు పలు టెక్నికల్ , నాన్ టెక్నికల్ సిబ్బంది పోస్టులున్నాయి. ఇందుకు సంబంధించి నియామక ప్రక్రియ చేపట్టాలని రోడ్లు భవనాల శాఖను ఆదేశించింది. దాంతో పాటు సత్వరమే పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలని సూచించింది. పెరిగిన నూతన ఉద్యోగాలతో పాటు, ఆర్ అండ్ బీ శాఖలో పరిపాలన బాధ్యతల వికేంద్రీకరణకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా కార్యాలయాల నిర్మాణం, మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు కేబినేట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రోడ్లు, భవనాలు, ఎలక్ట్రికల్, జాతీయ రహదారుల విభాగాల్లో మూడు చీఫ్ ఇంజనీర్ కార్యాలయాలు, పది సర్కిల్ కార్యాలయాలు, 13 డివిజన్ కార్యాలయాలు, 79 సబ్ డివిజన్ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి శాఖను కేబినెట్ ఆదేశించింది.

కాలానుగుణంగా చేపట్టే రోడ్ల మరమ్మతు (పీరియాడిక్ రెన్యువల్స్)ల కోసం, రూ. 1865కోట్లు, తక్షణమే పనులు చేపట్టేందుకు రూ. 635 కోట్ల నిధులను మంజూరు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

వానలు వరదలు తదితర ప్రకృతి విపత్తుల సందర్భంలో, ప్రజావసరాలకు అనుగుణంగా, అసౌకర్యాన్ని తొలగించి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టేందుకు వీలుగా డిఇఇ స్థాయి నుంచి సిఇ వరకు స్వతంత్ర నిర్ణయాధికారానికి కేబినెట్ ఆమోదించింది. డిఇకి ఒక్క పనికి రూ. రెండు లక్షలు (సంవత్సరానికి 25 లక్షలు)., ఇఇ కి రూ.25 లక్షల వరకు (ఏడాదికి 1.5 కోట్లు)., ఎస్ఇ పరిధిలో రూ.50 లక్షలు (సంవత్సరానికి రెండెడు కోట్లు), సిఇ పరిధిలో రూ. కోటి (సంవత్సరానికి మూడు కోట్ల వరకు) పనులు చేసేందుకు ఆమోదం తెలిపింది. అత్యవసర సమయాల్లో ఈ పనులను అవసరమైతే నామినేషన్ పద్ధతుల్లో చేపట్టేందుకు అధికారాలను కల్పించింది. ఇందుకోసం..ఏడాదికి రూ. 129 కోట్లు ఆర్ అండ్ బీ శాఖ ఖర్చు చేసేందుకు అవకాశం ఇచ్చింది. ఇదే పద్ధతిని అనుసరిస్తూ.. భవనాల విభాగంలోనూ అత్యవసర సమయాల్లో రిపేర్లు తదితర ప్రజావసరాల కోసం ఖర్చు చేసేందుకు కేబినేట్ అవకాశం కల్పించింది.

లిక్కర్ స్కామ్‌లో నేడు కవితను విచారించనున్న సిబిఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంచలనం రేపిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసుకు సంబంధించి సిబిఐ అధికారులు ఆదివారం టిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను విచారించనున్నారు. ఈ స్కామ్‌కు సంబంధించి ఈ నెల ఆరున కవితను విచారించటానికి నిర్ణయించామంటూ సిఆర్‌పిసిలోని సెక్షన్ 160 కింద ఇది వరకే సిబిఐ నోటీసులు జారీ చేసిన విషయం విదితమే. అయితే, తాను ఆ రోజు అందుబాటులో ఉండననీ, మరో తేదీని నిర్ణయించాలంటూ సిబిఐకి కవిత లేఖ రాశారు. అనంతరం, ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌తో పాటు ఫిర్యాదు కాపీని తనకు పంపించాలనీ, వాటిని పరిశీలించాకే తాను సిబిఐ అడిగే సమాచారాన్ని ఇవ్వగలనని పేర్కొంటూ ఢిల్లీలోని ఆ శాఖ డీఐజీకి మరో లేఖను కవిత రాశారు. అంతేగాక, ఈనెల 11, 12, 14, 15వ తేదీలలో తాను తన ఇంట్లో అందుబాటులో ఉండగలనని, ఈ నాలుగు రోజుల్లో ఏ రోజు సిబిఐ అధికారులు వచ్చినా.. తాను అందుబాటులో ఉంటానని తెలిపిన విషయం విదితమే. ఈ మేరకు ఆదివారం విచారణ జరపటానికి వస్తున్నామని, అందుబాటులో ఉండాలంటూ సిబిఐ అధికారులు కవితకు సమాచారం పంపినట్టు తెలిసింది. ఈ మేరకు ఢిల్లీ నుంచి ముగ్గురు సభ్యులతో కూడిన సీబీఐ అధికారుల బృందం కవితను విచారించనున్నట్టు సమాచారం. ఈ స్కామ్‌లో కేవలం సాక్షిగా మాత్రమే ఆమెను విచారించనున్నట్టు సిబిఐ వర్గాలను బట్టి తెలిసింది.

శంషాబాద్ విమానాశ్రయంలో భారీగా బంగారం పట్టివేత

- దుబాయ్ నుంచి వస్తూ కస్టమ్స్ అధికారులకు చిక్కిన ప్రయాణికుడు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బంగారు బిస్కెట్లు, నగలతో దుబాయ్ నుంచి వచ్చిన ప్రయాణికుడు ఒకరు కస్టమ్స్ అధికారులకు చిక్కాడు. హైదరాబాద్ విమానాశ్రయంలో శనివారం దుబాయ్ నుంచి వచ్చిన ఒక ప్రయాణికుడు అనుమానాస్పదంగా తిరుగుతుండగా కస్టమ్స్ అధికారులు ఆయనను పట్టుకొని విచారించారు. ఆయన వద్ద ఉన్న బ్యాగును సోదా చేయగా బంగారు నగలతో పాటు బంగారు బిస్కెట్లు బయట పడ్డాయి. హైదరాబాద్‌లో ఒకరికి అందజేయటానికి ఈ బంగారాన్ని తీసుకు వచ్చినట్టు కస్టమ్స్ అధికారులకు విచారణలో వెల్లడైంది. 212 గ్రాముల బరువున్న ఈ బంగారం విలువ రూ. 1.28 కోట్లుగా కస్టమ్స్ అధికారులు అంచనా వేశారు. ఇంత పెద్ద మొత్తంలో బంగారాన్ని సదరు ప్రయాణికుడు ఎక్కడి నుంచి తీసుకొచ్చాడు? ఇక్కడ ఎవరికి అందజేయనున్నాడు? అనే కోణంలో కస్టమ్స్ అధికారులు విచారిస్తున్నట్టు తెలిసింది.

టెలి కన్సల్టేషన్ సేవల్లో తెలంగాణకు మూడో స్థానం

- యూనివర్సల్ హెల్త్ కవరేజ్ డే సందర్భంగా కేంద్రం అవార్డు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టెలి కన్సల్టేషన్ సేవల్లో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. పెద్ద రాష్ట్రాల కేటగిరీలో మూడో స్థానం సాధించింది. యూనివర్సల్ హెల్త్ కవరేజ్ డే సందర్భంగా శనివారం ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య మంత్రి మన్సుక్ మాండవీయ చేతుల మీదుగా, రాష్ట్ర ప్రభుత్వం తరపున అరోగ్య, కుటుంబ సంక్షేమ విభాగం కమిషనర్ శ్వేతా మహంతి ఈ అవార్డును అందుకున్నారు. ఈ ఏడాది అక్టోబర్ 12 నుంచి డిసెంబర్ 8వ తేదీ వరకు నిర్వహించిన టెలి కన్సల్టేషన్ క్యాంపెయిన్‌లో మన రాష్ట్రం సత్తా చాటింది. దాదాపు రెండు నెలల కాలానికిగానూ 17,47,269 కన్సల్టేషన్స్ పూర్తి చేసింది. మొదటి స్థానంలో తమిళనాడు, రెండో స్థానంలో ఏపి నిలిచాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 5,876 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, సబ్ సెంటర్ల నుంచి టెలి కన్సల్టేషన్ ద్వారా 12 రకాలకుపైగా స్పెషాలిటీ వైద్యాన్ని ప్రజలకు అందిస్తున్నారు. ఈ కార్యక్రమం ప్రారంభమైన ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు మొత్తం 27,24,247 మంది టెలి కన్సల్టేషన్ సేవలు పొందారు. రాష్ట్రానికి మూడో స్థానం లభించడం పట్ల ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన వైద్య సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అరోగ్య రంగంలో మూడో స్థానంలో ఉన్న తెలంగాణను మొదటి స్థానంలో నిలిపే లక్ష్యంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

కెసిఆర్‌కు ప్రజలు గుణపాఠం చెప్పాలి : కోదండరాం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజలిచ్చిన తెలంగాణ రాష్ట్ర సమితి పేరును బిఆర్ఎస్‌గా మార్చిన సిఎం కెసిఆర్‌కు గుణపాఠం చెప్పాలంటూ తెలంగాణ జన సమితి (టిజెఎస్) అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్ నాంపల్లిలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. నిరుద్యోగుల ఆత్మహత్యలను పట్టించుకోకుండా, విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించి, ఉద్యమకారులను మోసం చేసిన కెసిఆర్ దేశ రాజకీయాల్లో చేసేదేమి లేదని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లో పోడు రైతులసమస్యలు, వ్యవసాయం, పెండింగ్ ప్రాజెక్టులపై చర్చించాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌లో రెండు కార్ కేర్ స్టూడియోలు

- టర్టెల్ వ్యాక్స్ ఏర్పాటు

ప్రజాశక్తి- హైదరాబాద్

చికాగో కేంద్రంగా కార్ కేర్ సేవలనందిస్తున్న టర్టెల్ వ్యాక్స్ తాజాగా హైదరాబాద్‌లో తమ రెండు సరికొత్త కో బ్రాండెడ్ కార్ కేర్ స్టూడియోలను ప్రారంభించినట్లు ప్రకటించింది. జెనెక్స్, రివల్యూషన్ సహకారంతో కూకట్‌పల్లి, బేగంపేటలో వీటిని అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. అల్ట్రా మోడ్రన్ టర్టెల్ వ్యాక్స్ డిటైలింగ్ సాంకేతితలతో పాటుగా అత్యున్నత అర్హతలు, సుశిక్షితులైన సేవా సిబ్బందిని కలిగిన ఈ టర్టెల్ వ్యాక్స్ కార్ కేర్ స్టూడియోలు విస్తృత శ్రేణి కార్ డిటైలింగ్ సేవలు, ఉత్పత్తులను అందించనున్నాయని పేర్కొంది.

కిడ్నాప్ కేసులో 32 మంది అరెస్ట్

- పరారీలో ప్రధాన నిందితుడు
- నవీన్‌రెడ్డి చెప్పేవన్నీ అబద్ధాలే.. : బాధితురాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన హైదరాబాద్‌లోని మన్నెగూడలో డెంటిస్ట్ వైశాలి కిడ్నాప్ కేసులో పోలీసులు 32 మందిని అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు నవీన్‌రెడ్డి పరారీలోనే ఉన్నాడు. ఆదిభట్ల సిఐ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తాను ప్రేమించిన యువతికి మరొకరితో వివాహం కుదిరిందని శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు మన్నెగూడలోని ఆమె నివాసంలో నిశ్చయ తాంబూలాలకు ముహూర్తమని నవీన్‌రెడ్డికి తెలిసింది. పెండ్లికొడుకు, బంధువులు రాకముందే ఉదయం 11 గంటలకు 5 కార్లు, డిసిఎం, ద్విచక్ర వాహనాల్లో సుమారు వంద మందితో నవీన్‌రెడ్డి యువతి ఇంటిపై దాడి చేశాడు. ఫర్నీచర్, సిసి కెమెరాలను ధ్వంసం చేశారు. ఫోన్లు పగలగొట్టారు. కార్లను ధ్వంసం చేశారు. అడ్డొచ్చిన యువతి తండ్రిని తీవ్రంగా కొట్టారు. తల్లిని పక్కకు నెట్టారు. ఓ బంధువుని ఇనుపరాడ్లతో కొట్టారు. యువతిని బలవంతంగా లాక్కెళ్లి నవీన్‌రెడ్డి కారులో అపహరించుకుపోయాడు. పక్కా రెక్కీతో అపహరణ జరిగినట్టు తెలుస్తోంది. పోలీసులు అప్రమత్తమై ఆరు గంటల్లోనే దుండగుల వాహనాన్ని నల్లగొండ జిల్లా ముషంపల్లిలో గుర్తించి అమ్మాయిని రక్షించారు. 32 మందిని అరెస్టు చేసి ఇబ్రహీంపట్నం కోర్టుకు తరలించారు. నిందితులపై హత్యాయత్నం, కిడ్నాప్ కేసులు నమోదు చేశారు. నిందితుల కుటుంబీకులు ఆదిభట్ల పోలీసు స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. తమ పిల్లలకు ఏమీ తెలియదని వదిలేయాలని ఆందోళన చేశారు.

వైశాలి కిడ్నాప్ కేసులో ప్రధాన నిందితుడు నవీన్‌రెడ్డి మాత్రం పోలీసులకు చిక్కలేదు. అతని కోసం హైదరాబాద్ సహా శివారు ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. కాగా, బాధితురాలు వైశాలి శనివారం ఎన్ఆర్ఐ అర్హత పరీక్షకు హాజరయ్యారు. ఆమెకు శుక్రవారం స్వల్ప గాయాలు కావడంతో ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం పోలీసు బందోబస్తు మధ్యనే పరీక్షకు హాజరైనట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

వైశాలిని కిడ్నాప్ చేసిన నవీన్ రెడ్డిని, అతనికి సహకరించిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కాడిగల్ల భాస్కర్‌తో కలిసి ఆమె శనివారం వైశాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నవీన్‌రెడ్డితో పరిచయం మాత్రమే.. : వైశాలి

నవీన్‌రెడ్డితో పరిచయమే తప్ప ఎలాంటి ప్రేమా లేదని వైశాలి స్పష్టం చేశారు. ఆమె శనివారం రాత్రి మీడియాతో మాట్లాడారు. తనను కాదని మరొకరిని ఎలా పెండ్లి చేసుకుంటావని నవీన్‌రెడ్డి తనను బెదిరించాడని చెప్పారు. అతనిపై తనకు ఎలాంటి ప్రేమా లేదన్నారు. తమ ఇంటిపై మూకుమ్మడిగా దాడి చేసి, అమ్మానాన్నను కొట్టారని, తనను బలవంతంగా లాక్కెళ్లి కారు తోశారని చెప్పారు. తన తండ్రిని చంపేస్తానని నవీన్‌రెడ్డి బెదిరించినట్టు ఆరోపించారు. కారులో తనను కొట్టాడని, అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆవేదన వ్యక్తం చేశారు. తన ఫొటోలను మార్ఫింగ్ చేశాడని చెప్పారు. తనకు అతనితో పెండ్లి జరిగిందని అబద్ధాలు చెప్పాడని, అందులో నిజం లేదన్నారు. తనను వేధింపులకు గురిచేస్తున్నాడని మూడు నెలల కిందటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని ఆరోపించారు. పోలీసులు పట్టించుకుని ఉంటే ఇప్పుడు ఈ ఘటన జరిగేది కాదన్నారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

నైపుణ్యాభివృద్ధిపై విద్యార్థులు దృష్టి సారించాలి

- ఐటి శాఖ మంత్రి కెటిఆర్
- విద్యార్థులకు ల్యాప్‌టాప్, యూనిఫామ్స్ పంపిణీ చేసిన మంత్రులు
- రూ.ఐదు కోట్లతో సైన్స్ బిల్డింగ్ ఏర్పాటుకు హామీ
- ఘనంగా ఆర్‌జియుకెటి ఐదవ స్నాతకోత్సవం

విద్యార్థినులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేస్తున్న మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నైపుణ్యాభివృద్ధి వైపు ఆర్‌జియుకెటి విద్యార్థులు దృష్టిసారించాలని రాష్ట్ర ఐటి శాఖ మంత్రి కెటిఆర్ అన్నారు. శనివారం నిర్మల్ జిల్లా బాసర ఆర్‌జియుకెటి యూనివర్సిటీలో ఏర్పాటుచేసిన ఐదవ స్నాతకోత్సవానికి కెటిఆర్‌తోపాటు మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి కలిసి హాజరై 550 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. అనంతరం కెటిఆర్ మాట్లాడుతూ ప్రపంచంలో ఐటీ రంగం విపరీతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో ఉందన్నారు. డిజిటలైజేషన్, డి కార్బోనైజేషన్, డిసెంట్రలైజేషన్ ఈ త్రీడి విధానం వైపే భవిష్యత్తు ఉంటుందని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఐటీ విద్యతో పాటు ఇండస్ట్రియల్ రంగం వైపు దృష్టి సారించేలా యూనివర్సిటీ అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వైపు విద్యార్థులు దృష్టి సారిస్తుండటంతో విద్యార్థులకు వీటిలో మరిన్ని కోర్సులను ప్రవేశపెట్టి విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు యూనివర్సిటీ అధికారులు కృషి చేయాలని కోరారు. ప్రముఖ ఐటీ కంపెనీలు ఎన్నో రాష్ట్రంలో సేవలు అందిస్తున్నాయని అన్నారు. టీహబ్ ఏర్పాటు చేసినప్పుడు పలువురు దుష్ప్రచారం చేశారని అన్నారు. కానీ ఇప్పుడు ఈ ఐటీ హబ్ ద్వారా వచ్చిన కంపెనీలు ప్రపంచ స్థాయి దృష్టిని ఆకర్షించాయని అన్నారు.

ఉన్నత విద్య అభివృద్ధికి సిఎం కెసిఆర్ తీసుకుంటున్న చర్యల వల్లే ఉన్నత విద్యారంగం ముందుకు వెలుతుందని అన్నారు. టీహబ్‌తో యూనివర్సిటీ అధికారులు ఒప్పంద, యూనివర్సిటీలో ఐదు కోట్లతో సైన్స్ బిల్డింగ్ నిర్మాణానికి కెటిఆర్ హామీ ఇచ్చారు. యూనివర్సిటీలోని చెరువు సుందరీకరణకు సింగరేణి, హెచ్ఎండీల సంబంధింత అధికారులు పర్యటించి ప్రణాళిక రూపొందిస్తారని అన్నారు. యూనివర్సిటీలో విద్యార్థుల కోసం పది పడకల ఆస్పత్రికి నిర్మాణనికి హామీ ఇచ్చారు. స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు మిషన్‌భగీరథతో అనుసంధానం చేసుకోవాలని అన్నారు. యూనివర్సిటీ విద్యుత్ బిల్లుల భారం తగ్గించేందుకు తరగతి భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు సహకారం అందిస్తానని అన్నారు. మన ఆర్‌జియుకెటి మన బాధ్యత పేరుతో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేందుకు పారిశుధ్య సిబ్బందిని నియమించుకోవాలని అధికారులకు సూచించారు. గతంలో యూనివర్సిటీలో పర్యటించిన సందర్భంగా విద్యార్థులకు ఇచ్చిన హామీలలో భాగంగా విద్యార్థులకు 2,200 ల్యాప్‌టాప్‌లు, 1500 మంది విద్యార్థులకు డెస్క్ టాబ్‌లు యూనిఫామ్‌లను మంత్రుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే విషయంలో రాజీ పడబోమని మెస్‌లపై కఠిన చర్యలు తప్పవని అన్నారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించే ఏకైక యూనివర్సిటీ ఆర్‌జియుకెటి అని... విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు విఠల్ రెడ్డి, బాల్క సుమన్, ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి పాల్గొన్నారు.

హింస, వివక్షత లేని సమాజం కావాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హింస, వివక్షత లేని సమాజం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాటుపడాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం ఐద్వా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని విఎస్‌టి నుంచి వీరనారి ఐలమ్మ భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ అరుణజ్యోతి అధ్యక్షతన నిర్వహించిన సభలో మల్లు లక్ష్మి మాట్లాడారు. రాజ్యాంగంలో కులం, మతం, జాతి, వర్ణం, లింగ వివక్షతలు లేకుండా అందరికీ సమానంగా జీవించే హక్కులు పొందుపర్చారన్నారు. అయితే, నేడు వాటి మీద దాడి జరుగుతోందని, ఆ హక్కులను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తినే తిండి మీద, వేసుకునే బట్టల మీద ఆంక్షలు విధిస్తూ, మరోపక్క భావ ప్రకటన స్వేచ్ఛ పైన దాడి చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాలపై భిన్నాభిప్రాయలు వ్యక్తం చేస్తున్న ఉద్యమకారులు, అభ్యుదయ వాదులు, పాత్రికేయులు, రచయితలపై రాజద్రోహం కేసులు పెడుతున్నారని చెప్పారు. మహిళలపై వివక్షత, చిన్నారులపై లైంగిక వేధింపుల ఘటనలు నిత్యకృత్యం అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి అంటోనియా గుటెరస్ భారత్‌లో మానవహక్కుల ఉల్లంఘన జరుగుతెందని పరోక్షంగా విమర్శించినట్టు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర సహాయక కార్యదర్శులు కె.నాగలక్ష్మి, మద్దెల వినోద, పి.శశికళ, రాష్ట్ర కమిటీ సభ్యులు స్వర్ణలత పాల్గొన్నారు.

'కల్లుగీత కార్మిక సంఘం 65 ఏండ్ల ఉద్యమ యాత్ర' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కల్లుగీత కార్మిక సంఘం 65 ఏళ్ల ఉద్యమ యాత్ర కార్యక్రమాన్ని ఈ నెల 13న హైదరాబాద్‌లోని సుందరయ్య కళానిలయంలో నిర్వహించనున్నట్టు ఆ సంఘం అధ్యక్షులు ఎంవీ రమణ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో సంబంధిత పోస్టర్‌ను అవిష్కరించారు. ఉద్యమ యాత్ర కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని రమణ తెలిపారు. సంఘం ఏర్పాటైన నాటి నుంచి నేటి వరకు సాధించిన విజయాలు, పోరాటాల గురించి చర్చిస్తామన్నారు. భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. సంఘంలో పనిచేస్తున్న క్రమంలో ఈ కాలంలో అమరులైన వారి కుటుంబాలకు ఈ సందర్భంగా ఆత్మీయ సన్మానం చేయనున్నట్టు తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలోకల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. కృష్ణ స్వామి, మోదుగు పూలు ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా అడ్వైజర్ గర్వందుల రాజు, పెద్ది రాణా ప్రతాప్, రాఘవేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE XVII SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT HYDERARAD

O.S. No. 1230 OF 2003

BETWEEN

SHRIRAM CHITS PRIVATE LIMITED. (SANTOSHNAGAR)

. ... .PLAINTIFF

AND

1.J.David Raju, S/o.J.Rama Rao, aged 28 yrs, Occ: Tailor, O/o. Tailor Shop Yelia Reddy Guda, Ameerpet, Hyderabad. R/o.H.No 8-3-231/F/43/4, Sri Krishna Nagar, Yousufguda, Hyd.
2.P. Krishna Murthy, S/o. P.Mukunda Chary, aged 49 yrs, Occ :MECH-II, St No:077343, O/o. APSRTC, Ranigunj-II Depot, Hyderabad. R/o.H.No: 2-62, Kabeernagar, Balkampet, Hyderabad.
3.S.Venkata Narsimha Chary,S/o. S.Kumarji, aged 50 yrs,Occ:Conductor St. No:088188, O/o. APSRTC, BHEL, Ramachandrapuram Depot Medak:Dist. R/o.H.No.18-6-971,Laldarwaza, Balagunj,Hyderabad.
4.T. Anjaiah, S/o.T.Narayana, aged 52 Yrs, Occ: Driver, St.No: 100925, Ranigunj-II Depot, Hyd. O/o.APSRTC R/o.H.No:3-1-863/1, Nimboli Adda, Kachiguda, Hyderabad.
5.V. Laxmipathy, S/o.V.Venkataiah, aged 47 Yrs Occ: Conductor, St.No: 087917, O/o.APSRTC, Ranigunj-I Depot, Hyd. R/o. H.No: 1-7-630/31, Ramnagar,Hyderabad

.... DEFENDANTS

Please Take notice that the plaintiff filed above suit against you for recovery of Rs. 1,58,908/- The Hon'ble court posted the matter on **14-12-2022** for your appearance. Therefore you are hereby required to appear before the Hon'ble court on the above said date at **10-30** AM either in person or through an advocate. Otherwise the matteer will be decided in your absence.

//BY ORDER OF THE COURT//

K VIJAYENDER REDDY
Advocate
Barkatpura, Hyderabad.

ఆ విధానం.... కార్పొరేట్లు, మనువాదులకు అనుకూలం

- ఎస్ఇపిపై ఎస్ఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి మయూక్ బిస్వాస్
- విద్యార్థుల డ్రాపౌట్స్, ఆత్మహత్యలపై ఆందోళన
- దేశానికే ప్రత్యామ్నాయం చూపిస్తున్న కేరళ

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మయూక్ బిస్వాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మోడీ ప్రభుత్వ రూపొందించిన నూతన జాతీయ విద్యావిధానం (ఎన్ఇపి)తో దేశం నాశనమవుతుందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జాతీయ ప్రధాన కార్యదర్శి మయూక్ బిస్వాస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆ విధానం కార్పొరేట్లకు, మనువాదులకు అనుకూలంగా ఉందని ఆరోపించారు. హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. విద్యా ప్రయివేటీకరణతో ఉపయోగం లేదనీ, ఇప్పటికే ఫీజులు కట్టలేక పేద విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. బిజెపి ప్రయివేటు యూనివర్సిటీల రాకను ప్రోత్సహిస్తున్నదనీ, అదే జరిగితే విద్యార్థులు పెద్ద మొత్తంలో ఫీజులు చెల్లించుకోవాల్సి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. బహుళ భాషల వైవిధ్యమున్న మన దేశంలో ఒకే భాషను అందరిపై రుద్దాలనుకోవడం చెల్లదని స్పష్టం చేశారు. ఎవరితోనూ చర్చించకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెస్తున్న చట్టాలను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. ప్రజావ్యతిరేక విధానం ఒక దాని తర్వాత ఒకటన్నట్టు కేంద్రం ముందుకు తెస్తుందని గుర్తు చేశారు. ప్రభుత్వ విద్యావ్యవస్థను నాశనం చేయడంలో భాగంగా ముందుగా మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వీర్యం చేయడం మొదలెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బిజెపి తన విధానంతో మైనార్టీలను, దళిత విద్యార్థుల భవిష్యత్తు నాశనం చేస్తున్నదని తెలిపారు. మౌలానా ఆజాద్ స్కాలర్‌షిప్‌ను రద్దు చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. విద్యార్థుల డ్రాపౌట్స్, ఆత్మహత్యలు పెరిగిపోతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థులందరినీ ఐక్యం చేసి పోరాడేందుకు ఈ నెల 13 నుంచి 16 వరకు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ 17 జాతీయ మహాసభ దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మహాసభల్లో భాగంగా మొదటి రోజు 13న ఉదయం 11గంటలకు నగరంలోని ప్రసాద్ ఐమ్యాక్స్ నుంచి పీపుల్స్ ప్లాజా వరకు విద్యార్థి కవాతు ప్రదర్శనను నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈ సభకు ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు విపి సాను అధ్యక్షత వహించనుండగా, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ ప్రధాన వక్తగా పాల్గొననున్నారు. తనతో పాటు ఎస్ఎఫ్ఐ జాతీయ గర్ల్స్ కన్వీనర్ ధీప్సితా ధర్, జాతీయ ఉపాధ్యక్షులు దీనిత్ డెంటా, జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు నితీష్ నారాయణ్, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు, రాష్ట్ర అధ్యక్షులు ఆల్.ఎల్.మూర్తి హాజరవుతారని వెల్లడించారు. దేశానికి కేరళ ప్రత్యామ్నాయం చూపించిందని, అక్కడి ప్రభుత్వం విద్యకు తగినంత బడ్జెట్ కేటాయిస్తున్నదని తెలిపారు. మహాసభ విద్యార్థులకు మంచి భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తోందని, వారి భవిష్యత్తే దేశ భవిష్యత్తన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థి నాయకులపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థి ఎన్నికలపై దేశంలో, రాష్ట్రంలో నిషేధం పెట్టడం సరికాదని అభిప్రాయపడ్డారు. విశ్వవిద్యాలయాల్లో ప్రజాస్వామ్య వాతావరణం అవసరమని తెలిపారు. అందరికీ మెరుగైన విద్య అందించే పరిస్థితులు రావాలని ఆకాంక్షించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు మాట్లాడుతూ అందరికి విద్య - అందరికి ఉపాధి కోసం ఎస్ఎఫ్ఐ పోరాడుతోందని తెలిపారు. మహాసభలో 29 రాష్ట్రాల నుంచి 750 మంది ప్రతినిధులతో పాటు క్యూబా, శ్రీలంక తదితర దేశాల నుంచి విద్యార్థి నాయకులు పాల్గొంటారని తెలిపారు. నాలుగు రోజుల పాటు నూతన జాతీయ విద్యావిధానంతోపాటు అన్ని విషయాలను మహాసభలో క్షుణ్ణంగా చర్చిస్తామని, ఎస్ఎఫ్ఐ మాజీ అధ్యక్ష, కార్యదర్శుల సెషన్ ప్రత్యేకంగా ఉంటుందని చెప్పారు. అనంతరం కేంద్ర కార్యవర్గం ఎన్నిక ఉంటుందన్నారు. విద్యకు జిడిపిలో ఆరు శాతం, బడ్జెట్‌లో 30 శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు. చదువు కోసం - ఉపాధి కోసం అందరం ఒక్కటవుదామంటూ పిలుపునిచ్చారు.

సిఎం కెసిఆర్ స్పష్టతనివ్వాలి

కేంద్రంలోని బిజెపి సర్కార్ తెచ్చిన నూతన జాతీయ విద్యావిధానంపై బిఆర్ఎస్ తన వైఖరి తెలపాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎల్ఎల్ మూర్తి డిమాండ్ చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో దీనికి సంబంధించి స్పష్టతనివ్వాలని కోరారు. ఇప్పటికే కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు దీన్ని వ్యతిరేకిస్తూ స్పష్టతనిచ్చాయని గుర్తు చేశారు. తాను అధికారంలోకి వస్తే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామంటూ మోడీ హామీ ఇచ్చారనీ, ఆయన అధికారంలోకి వచ్చాక ఉన్న ఉద్యోగాలు పోతున్నాయని విమర్శించారు. దేశంలో 30 కోట్ల మంది నిరుద్యోగులున్నారని తెలిపారు. ఎస్ఎఫ్ఐ ప్రజాస్వామ్యం కోసం పోరాడుతుందనీ, రాజ్యాంగం కోసం నిలబడుతుందని స్పష్టంచేశారు. ప్రభుత్వ విద్యా పరిరక్షణ పోరాటాలకు మహాసభ వేదిక దిశానిర్దేశం చేయనుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉన్నత విద్య ఎస్‌సి, ఎస్‌టి, బిసి పేద వర్గాలకు దక్కకుండా ఉద్దేశపూర్వకంగా దూరం చేస్తోందని తెలిపారు. జాతీయ స్థాయి ఫెల్లోషిప్‌లు 50 శాతం వరకు తగ్గించిందని ఉదహరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రవి, రజినీకాంత్, రాష్ట్ర గర్ల్స్ కో కన్వీనర్ అనూష, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్ రెడ్డి, ఆహ్వాన సంఘం కోశాధికారి జావీద్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంసి, మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మహిళా సాధికారతపై సదస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ (ఐఎంసి), మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మహిళా సాధికారితపై శనివారం హైదరాబాద్‌లో సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హిమాకోహ్లి హాజరయ్యారు. మహిళా సాధికారిత, తెలంగాణలో పరిస్థితులపై సదస్సులో చర్చించారు. రాష్ట్రంలో పలువురు మహిళలు ఆయా రంగాల్లో సమర్థవంతంగా రాణిస్తున్నారని సదస్సులో చర్చించారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వాలు సహకరించాలని అభిప్రాయపడ్డారు. మహిళా సమస్యలపై కూడా చర్చించారు. ఐపిఎస్ మాజీ అధికారి మమతా శర్మ, ఐఎఎస్ అధికారి పద్మజ, జీవన్ దాన్ హెడ్ డాక్టర్ స్వర్ణలత, వి హబ్ సిఇఒ దీప్తి రావుల, మెడికవర్ హాస్పిటల్స్ ప్రతినిధి డాక్టర్ ఇషా సిన్హా తదితరులు మాట్లాడారు.

రేసింగ్ లీగ్...మళ్లీ గందరగోళం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరం నడిబొడ్డున జరుగుతున్న కార్ రేసింగ్ నిర్వహణలో మళ్లీ గందరగోళం నెలకొంది. శనివారం క్వాలిఫైయింగ్ పోటీలు జరపకుండా రెండు ప్రాక్టీస్ సెషన్స్ మాత్రమే నిర్వహించారు. నిర్వాహకులు ఆదివారమే అన్ని పోటీలు నిర్వహించే యోచనలో ఉన్నారు. రెండు కార్లు రేస్ మధ్యలో ఆగడంతో రెండుసార్లు రెడ్ ఫ్లాగ్స్ వచ్చాయి. గతంలో మాదిరిగానే మరోసారి రేస్ నిర్వహణ ఆలస్యమైంది. రేస్‌లు ఆలస్యంగా ప్రారంభం కావడంతో మెయిన్ రేస్-1 జరగలేదు. ఆదివారం ఇండియన్ రేసింగ్ లీగ్‌లోని 3 రేస్‌లు ఉంటాయి. సాంకేతిక కారణాలతో స్పోర్ట్స్ కార్లు చాలా ఆలస్యంగా ట్రాక్ ఎక్కాయి.

ప్రమాదకర పరిస్థితుల్లో దేశం

- హిందూత్వ అజెండా వల్లే గుజరాత్‌లో విజయం
- 'గాంధీత్వ నుంచి హిందూత్వ దాకా' పుస్తకావిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుజరాత్ ఎన్నికల్లో బిజెపి ఘన విజయం సాధించిందంటూ ఆ పార్టీ నేతలు గొప్పగా చెప్పుకుంటున్నారనీ, వాస్తవానికి హిందూత్వ ఎజెండా వల్లే మోడీకి ఆ విజయం సాధ్యమైందని సీనియర్ సంపాదకులు, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు కె రామచంద్రమూర్తి వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో గుజరాత్‌లో వచ్చిన ఫలితం హిమాచల్, ఢిల్లీలో ఎందుకు రాలేదో చెప్పాలంటూ బిజెపిని ప్రశ్నించారు. మూడు చోట్ల మూడు పార్టీలకు ప్రజలు ఎందుకు పట్టం కట్టారో తెలుసుకోవాలంటూ ఆ పార్టీ నేతలకు చురకలంటించారు. సీనియర్ జర్నలిస్టు కల్లూరి భాస్కరం రచించిన 'గాంధీత్వ నుంచి హిందూత్వ దాకా' అనే విశ్లేషణాత్మక వ్యాస సంపుటిని శనివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో రామచంద్రమూర్తి అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత దేశ పరిస్థితులను అర్థం చేసుకోవటానికి ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు. ప్రమాదకర పరిస్థితులను అర్థం చేసుకోవటం, వాటిపై రచనలు చేయటం, తద్వారా సమాజాన్ని జాగృతం చేయటం అభినందనీయమన్నారు. కుహనా హిందూత్వ వాదానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న, మాట్లాడుతున్న సమసమాజ స్వాప్నికులకు ఇదో అక్షరాయుధమని ప్రశంసించారు. పండిత భాస్కరం సామాజిక స్పృహ ఉన్న వ్యక్తి అని చెప్పారు. దేశం ఇప్పుడు ప్రమాదకర పరిస్థితిలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఫెడరల్ వ్యవస్థను రద్దు చేసి, సెంట్రల్ వ్యవస్థను నిర్మించేందుకు ప్రయత్నం జరుగుతున్నదని తెలిపారు. ఇది పన్నుల విధానంలోనూ, విద్యా, చివరికి నీటిని కూడా ఏకీకృతం చేసే విధానాన్ని తీసుకొస్తున్న స్థితి కనిపిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ముస్లింలను రెండో తరగతి పౌరులుగా పరగణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గోమాసం తీసుకుపోతున్నారని హత్య చేయడం, గౌరీ లంకేశ్, కల్బుర్గి హత్య తదితర అంశాలు ఈ పుస్తకంలో భాస్కరం స్పృశించారని వివరించారు. ప్రజాస్వామ్యమంటే.. చర్చని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు టంకశాల అశోక్ మాట్లాడుతూ ఈ పుస్తకం చాలా విలువైనదన్నారు. ఇందులో లోతైన తాత్విక విషయాలున్నాయని వివరించారు. గాంధీని హత్యచేశారుగానీ..గాంధీత్వాన్ని కాదని తెలిపారు. ఆంధ్రజ్యోతి సంపాదకులు కె శ్రీనివాస్ మాట్లాడుతూ ఇది యుద్ధసమయమన్నారు. ఇలాంటి సందర్భంలో ఈ పుస్తకం రావటం సరైందేనని చెప్పారు. ఈ పుస్తకం ఎక్కువమందని ప్రభావితం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పుస్తక పరిచయాన్ని బీపీ పడాల చేయగా శ్రీశైల్‌రెడ్డి సభకు అధ్యక్షత వహించారు.

అవినీతికి అవకాశం ఇవ్వొద్దనే బొగ్గు గనుల వేలం

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గతంలో మాదిరిగా కోల్‌మైన్‌లో అవినీతి జరగవద్దనే ఉద్దేశంతోనే బొగ్గు గనుల వేలం తీసుకొచ్చామని కేంద్ర పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రైవేటు, ప్రభుత్వం.. ఏ సెక్టార్ అయినా వేలంలోనే కోల్‌మైన్ తీసుకోవాలని 2020లోనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. గతంలో చాలా కంపెనీలు కోల్ ఉత్పత్తి చేయకపోవడం వల్ల విదేశాల నుంచి కోల్ దిగుమతి చేసుకోవాల్సి వస్తోందన్నారు. 8 ఏళ్లలో బిజెపి ప్రభుత్వంపై ఒక్క అవినీతి మరక కూడా లేదని, అదే యుపిఎ హయాంలో కోకొల్లలుగా కుంభకోణాలు జరిగాయని ఆరోపించారు. 2015 కోల్ చట్టాన్ని అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం పొగిడిందన్నారు. యుపిఎ హయాంలో గుజరాత్, రాజస్థాన్‌కు కేటాయించిన బొగ్గు గనులనే ఇప్పుడు కేటాయించామని తెలిపారు. గుజరాత్‌తో పాటు తెలంగాణకు కూడా బొగ్గు గనులు కేటాయించామన్నారు. ఎవరైనా సరే టెండర్ ద్వారానే బొగ్గు గనులు దక్కించుకోవాలని తెలిపారు. సింగరేణిని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రైవేటు కంపెనీగా మార్చిందని ఆరోపించారు.

కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ త్వరగా చేపట్టాలి

- తెలంగాణ ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ ఎలాంటి ఆటంకాలు లేకుండా త్వరగా చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రమణారెడ్డి, కుప్పిశెట్టి సురేష్ ప్రభుత్వాన్ని కోరారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని అయ్యప్పస్వామి ఆలయం నుంచి సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం కోనాయిపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం వద్దకు శనివారం సంకల్ప ఆశిస్సు యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ సంకల్ప ఆశిస్సు పాదయాత్ర మూడ్రోజులపాటు కొనసాగి ఈ నెల 12వ తేదీన కోనాయిపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకుంటుందని తెలిపారు. మానవతా దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం 2016లో జిఒ నెంబర్ 16 ద్వారా క్రమబద్ధీకరణకు ఉత్తర్వులు జారీ చేసినట్టు చెప్పారు. అనివార్య కారణాల వల్ల కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ ఇంతవరకు జరగలేదన్నారు. ఎటువంటి ఆటంకాలు లేకుండా క్రమబద్ధీకరణ జరిగేందుకు సిఎం కెసిఆర్ ఇష్టదైవం కోనాయిపల్లి వెంకటేశ్వర స్వామి ఆశిస్సులు మన అందరిపై ఉండాలని కోరుతూ ఈ యాత్రను చేపడుతున్నామన్నారు. ఈ యాత్రకు తెలంగాణ ఇంటర్మీడియట్ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మైలారం జంగయ్య, మాచర్ల రామకృష్ణ గౌడ్ ఆశిస్సులు అందజేశారని చెప్పారు. టిఎస్ యుటిఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు వలి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అరవింద్ సంఘీభావం అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో 475 యూనియన్ రాష్ట్ర నాయకులు డాక్టర్ వి శ్రీనివాస్, కెపి శోభన్ బాబు, ఎం శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ పడాల జగన్నాథం, బొంకు ప్రవీణ్ కుమార్, ఎం ప్రవీణ్ కుమార్, కురుమూర్తి, గంగాధర్, గోవర్ధన్, సంగీత, సాయిలు, కాంపల్లి శంకర్, విక్రమాదిత్య, మధుకర్, సాయిలు సంగీత పాలిటెక్నిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి ఉదయభాస్కర్, నాయకులు సునీల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ల ప్రయోజనాలకే విద్యుత్ బస్సులు

- కాలుష్యం పేరుతో ప్రజారవాణా ఆక్రమణ
- సబ్సిడీలు చెల్లిస్తోంది ప్రపంచబ్యాంకే...
- ప్రత్యామ్నాయాలు ఉన్నా... పట్టించుకోని కేంద్రం
- టిఎస్ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర సదస్సులో వక్తలు

రాష్ట్ర సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెట్టుబడిదారులు, కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే పర్యావరణ పరిరక్షణ పేరుతో కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బస్సుల్ని తీసుకొస్తోందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. తాము విద్యుత్ బస్సులకు వ్యతిరేకం కాదనీ, వాటి తయారీ, నిర్వహణపై కేంద్రప్రభుత్వం రూపొందించిన విధివిధానాలనే వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టిఎస్ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) రాష్ట్ర తృతీయ మహాసభ సందర్భంగా శనివారం 'విద్యుత్ బస్సులు-ఆర్‌టిసి, సమాజంపై ప్రభావం' అంశంపై సదస్సు జరిగింది. ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రాంచందర్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. దేశవ్యాప్తంగా విద్యుత్ వాహనాలను ప్రవేశపెడితే కాలుష్యం తగ్గదనీ, ప్రజారవాణాను ప్రోత్సహిస్తేనే అది సాధ్యమవుతుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బస్సుల తయారీ, నిర్వహణలో ఆర్‌టిసిలకు ఎందుకు అవకాశం ఇవ్వట్లేదని ప్రశ్నించారు. ఒక్క విద్యుత్ బస్సు తయారీ ఖర్చు రూ.2.20 కోట్ల నుంచి రూ.1.80 కోట్లకు తగ్గిందని చెప్పారు. సాధారణ బస్సులతో పోలిస్తే, నిర్వహణ తక్కువగా ఉంటుందని చెప్తున్నారనీ, మరి పెట్టుబడి ఎక్కువ అవుతున్న విషయాన్ని మాత్రం ప్రస్తావించట్లేదన్నారు. పైగా ఈ బస్సులను ఆర్‌టిసిలకు అద్దెకు ఇస్తే, కిలో మీటర్‌కు అదనంగా ఏడు రూపాయల వరకు చెల్లించాల్సి వస్తుందని, ఈ భారాన్ని ఎవరు భరించాలని అడిగారు. అంతర్జాతీయ గ్లాస్కో సమ్మిట్‌లో గ్లోబల్ వార్మింగ్ పేరుతో 2030 నాటికి 50 శాతం, 2070 నాటికి పూర్తిగా పెట్రోల్, డీజిల్ వాహనాల సంఖ్యను తగ్గిస్తామని కేంద్రప్రభుత్వం ప్రకటన చేసిందని గుర్తుచేశారు. ప్రపంచంలో అత్యధిక కాలుష్యం వెదజల్లుతున్న దేశాల్లో అమెరికా 27 శాతం కాలుష్యాన్ని వెలువరిస్తోందని, ఆ తర్వాతి స్థానం 22 శాతంతో యూరప్ దేశాలు ఉన్నాయని చెప్పారు. ఆ దేశాలు కాలుష్యాన్ని తగ్గించుకోకుండా, భారతదేశం వంటి దేశాలకు ఆదేశాలు జారీ చేయడం ఏంటని ప్రశ్నించారు. విద్యుత్ వాహనాల కొనుగోలుపై సబ్సిడీని ప్రపంచబ్యాంక్ చెల్లిస్తున్నదని తెలిపారు. దేశంలో అత్యధిక విద్యుదుత్పత్తి ప్రభుత్వరంగంలోనే ఉందనీ, దాన్ని ఇప్పుడు ప్రయివేటు, కార్పొరేట్ సంస్థలకు అప్పగించే కుట్రలో భాగంగానే ఈ తరహా విధాన నిర్ణయాలను కేంద్రం తీసుకుంటున్నదని వివరించారు. ఆర్‌టిసిలకు విద్యుత్ బస్సులు ఇస్తున్నట్టు ప్రచారం చేస్తున్నారనీ, కానీ ఆ బస్సులు ఎవి ఆర్‌టిసి పేరున రిజిస్ట్రేషన్‌తో ఉండవని చెప్పారు. కేంద్ర ఆంక్షలకు తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు తలొగ్గలేదనీ, తమ రాష్ట్రాల్లో ప్రజారవాణాను తామే నిర్వహించుకుంటామని తేల్చిచెప్పాయన్నారు. దేశంలోకెల్లా అత్యధికంగా పూనాలో వంద ఎలక్ట్రిక్ బస్సులు తిరుగుతున్నాయనీ, ఇక్కడ కిలోమీటర్‌కు రూ.పది అదనంగా అక్కడి మున్సిపల్ కార్పొరేషన్ చెల్లిస్తోందని ఉదహరించారు. ప్రపంచబ్యాంక్ ఆదేశాలతో అమెరికా ప్రయోజనాలు కాపాడటం కోసమే దేశంలోకి విద్యుత్ వాహనాలను ప్రవేశపెడుతున్నారని స్పష్టం చేశారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చేందుకే ఎలక్ట్రిక్ బస్సుల్ని తెస్తున్నారని చెప్పారు. దేశంలో వ్యక్తిగత వాహనాల సంఖ్య పెరుగుతున్నదనీ, ప్రజారవాణాను ప్రోత్సహిస్తే, సహజంగానే ఆ వాహనాల వినియోగం తగ్గుతుందని అన్నారు. ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవట్లేదన్నారు. ఆర్టీసీలోకి విద్యుత్ బస్సులు వస్తే 15 వేల మంది ఉద్యోగులు మిగులు సిబ్బందిగా మారతారని హెచ్చరించారు. కేంద్రప్రభుత్వ విధానాలను రాష్ట్రం వ్యతిరేకించాలనీ, ఆర్‌టిసి ఉద్యోగుల పక్షాన నిలుస్తూ విద్యుత్ బస్సుల విధివిధానాలకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఐక్యపోరాటాల ద్వారానే ప్రజా, ఉద్యోగ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టగలమని స్పష్టం చేశారు. టిఎస్ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఎస్ రావు మాట్లాడుతూ విద్యుత్ బస్సుల నిర్వహణలో ఆర్టీసీలకు గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (జిసిసి) నిబంధన పెడుతున్నారనీ, ఇది అమల్లోకి వస్తే, ఆ బస్సులు తిరిగినా, లేకున్నా ప్రతినెలా డబ్బులు చెల్లించాల్సిందేనని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ పేరుతో రవాణారంగాన్ని కార్పొరేట్లకు అప్పగించే కుట్రలు జరుగుతున్నాయని, వీటిపట్ల ప్రజలు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఎలక్ట్రిక్ బస్సులు ఆర్‌టిసిల్లోకి వస్తే అదనంగా కిలోమీటర్‌కు రూ.14 నుంచి రూ.16 వరకు అదనంగా చెల్లించాల్సి వస్తుందనీ, దీనివల్ల ఆర్‌టిసి ఆర్థికంగా మరింత కుదించుకుపోతుందని అన్నారు. బస్సుల్లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రవేశపెడితే, ఉద్యోగుల అవసరమూ ఉండదన్నారు. రాష్ట్రప్రభుత్వమూ ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేస్తే సబ్సిడీలు ఇస్తోందని, వీటిని ప్రపంచబ్యాంకు ద్వారా చెల్లిస్తున్నారని వివరించారు. ఎపిఎస్ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుందరయ్య మాట్లాడుతూ ప్రభుత్వం వేసిన భక్తవత్సలం కమిటీ రిపోర్టును ఇప్పటి వరకు బయటపెట్టలేదని చెప్పారు. ఎపిలో తిరుపతి-తిరుమల కేంద్రంగా వంద ఎలక్ట్రిక్ బస్సులు తిరుగుతున్నాయనీ, ఫలితంగా అక్కడి అలిపిరి డిపో మూతపడే స్థితికి వచ్చిందని తెలిపారు. విద్యుత్ బస్సులు ప్రయివేటు, పెట్టుబడిదారీ సంస్కరణల అమల్లో భాగమేనని వివరించారు. టిఎన్‌టియుసి (కార్మికపరిషత్) ప్రధాన కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ కార్మికుల ప్రయోజనాలు కాపాడటంలో సిఐటియు, ఎస్‌డబ్ల్యుఎఫ్ ఎప్పుడూ ముందుంటాయని చెప్పారు. ప్రజారవాణా పరిరక్షణకు ఎస్‌డబ్ల్యుఎఫ్ అకుంఠిత దీక్షతో పనిచేస్తుందంటూ, మహాసభ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు మాట్లాడారు.

పాలక్కాడ్‌కు చేరిన అమరవీరుల జ్యోతి యాత్ర

- ఘనంగా స్వాగతం పలికిన కేరళీయులు
- ఆకట్టుకున్న ఎడ్ల బండ్ల ప్రదర్శన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) జాతీయ మహాసభ నేపథ్యంలో మన రాష్ట్రంలోని జనగాం జిల్లా కడివెండి గ్రామం నుంచి ఈ నెల 5న ప్రారంభమైన రైతు అమరవీరుల జ్యోతి... శనివారం కేరళ రాష్ట్రంలోని పాలక్కాడ్‌కు చేరుకుంది. యాత్ర బృందానికి కేరళీయులు, రైతులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. రెడ్‌షర్టు వలంటీర్ల కవాతు, ఎడ్ల బండ్ల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అమరువీరుల జ్యోతిని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షులు విజయ రాఘవన్ అందుకున్నారు. తెలంగాణ నుంచి ప్రారంభమైన యాత్రకు ఎఐకెఎస్ సహాయ కార్యదర్శి కృష్ణప్రసాద్, కేంద్ర కమిటీ సభ్యులు టి.సాగర్ నాయకత్వం వహిస్తారు. రెండో యాత్ర తమిళనాడులోని కిజ్వెన్‌మణిలో ప్రారంభమైంది. దీనికి ఎఐకెఎస్ సహాయ కార్యదర్శులు డాక్టర్ విజ్జు కృష్ణన్, ఎస్‌కె ప్రీజా నాయకత్వం వహించారు. తెలంగాణలో ప్రారంభమైన యాత్ర కేరళ రాష్ట్రంలోని పాలక్కాడ్‌కు చేరనుంది. ఈ సందర్భంగా యాత్ర డిప్యూటీ నాయకులు టి సాగర్ మాట్లాడుతూ రైతు అమరవీరుల జ్యోతి యాత్రకు ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున తరలి వచ్చారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. అన్నదాతల ఆత్మహత్యలు, ఎరువుల సబ్సిడీ ఎత్తేయడం, సబ్సిడీలు రద్దు చేయడం వంటి చర్యలతో వ్యవసాయ రంగం సంక్షోభంలో పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు బిజెపి సర్కారు తీవ్రంగా ప్రయత్నిస్తున్నదని చెప్పారు. రైతు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు.

సమాజ అభ్యున్నతే సిపిఐ లక్ష్యం

- పార్టీ వ్యవస్థాపక దినోత్సవ ప్రచార కటౌట్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పాలకుల ప్రజావ్యతరేక విధానాలను ఎప్పటికప్పుడు నిలదీస్తూ సమాజ అభ్యున్నతే సిపిఐ ముందుకు సాగుతున్నదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నరసింహ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సిపిఐ కార్యాలయంలో పార్టీ 98వ వ్యవస్థాపక దినోత్సవ ప్రచార కటౌట్‌ను అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఫాసిజం ప్రమాదం పెరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సిపిఐ 98వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నదని తెలిపారు. భారత స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించి, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం నిర్వహించిన ఘనత కమ్యూనిస్టు పార్టీకే దక్కుతుందని తెలిపారు. ప్రజల రక్షణ కోసం అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసిన చరిత్ర సిపిఐకే ఉందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి. వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లలో 30 క్లినిక్‌లకు విస్తరణ లక్ష్యం

- ఆర్ట్ ఫెర్టిలిటీ క్లినిక్స్ సిఇఒ వెల్లడి
- సంస్థలో చేరిన కెడి నయ్యర్

హైదరాబాద్ : వచ్చే రెండేళ్లలో దేశ వ్యాప్తంగా 24 నుంచి 30 ఆర్ట్ ఫెర్టిలిటీ క్లినిక్‌లకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) డాక్టర్ సోమేష్ కుమార్ మిట్టల్ తెలిపారు. సంతాన సాఫల్యత నిపుణులు డాక్టర్ కెడి నయ్యర్ ఆర్ట్ ఫెర్టిలిటీలో చేరారని శనివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాకు తెలిపారు. ప్రస్తుతం తమ సంస్థ హైదరాబాద్, ఢిల్లీ, ముంబయి, చెన్నయ్, గురుగావ్, అహ్మదాబాద్‌లో క్లినిక్‌లను కలిగి ఉందన్నారు. వచ్చే రెండేళ్లలో దక్షిణాదిలోని అన్ని ప్రధాన నగరాల్లోనూ కార్యకలాపాలను ప్రారంభిస్తామన్నారు. దేశంలో 15 శాతం కుటుంబాలు సంతాన లేమిని ఎదుర్కొంటున్నాయన్నారు. ఇతర ఫెర్టిలిటీ సెంటర్లతో పోల్చితే తమ సంస్థ తక్కువగా ఛార్జ్ చేయడంతో పాటుగా అత్యాధునిక పరిష్కారాలను అందిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఆ సంస్థ సహ మెడికల్ డైరెక్టర్లు డాక్టర్లు రిచా జగ్తాప్, పరుల్ కటియర్, ఫతెమి పాల్గొని మాట్లాడారు.

ఎంఎఫ్‌ల్లో పెట్టుబడులు డీలా

- నవంబర్‌లో 75 శాతం పతనం
- ఆర్ట్ ఫెర్టిలిటీ క్లినిక్స్ సిఇఒ వెల్లడి
- సంస్థలో చేరిన కెడి నయ్యర్

21 నెలల కనిష్టానికి చేరిక

ముంబయి : ప్రజల ఆదాయ మార్గాలు పడిపోవడంతో మ్యూచువల్ ఫండ్లలోనూ పెట్టుబడులు తగ్గిపోతున్నాయి. ప్రస్తుత ఏడాది నవంబర్‌లో ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో నికర నిధులు 75 శాతం పడిపోయి రూ.2,258 కోట్లుగా నమోదయ్యాయి. దీంతో ఎంఎఫ్‌ల్లో పెట్టుబడులు 21 నెలల కనిష్టానికి దిగజారాయని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (అంఫీ) గణంకాలు తెలిపాయి. ఇంతక్రితం అక్టోబర్‌లో ఈ రంగంలో రూ.9,390 కోట్ల పెట్టుబడులు చోటు చేసుకున్నాయి. ఇన్వెస్టర్లు ఎంఎఫ్‌ల్లో ఉన్న వాటాలను అమ్మకోవడం ద్వారా లాభాల స్వీకరణకు ఆసక్తి చూపుతున్నారని మార్నింగ్‌స్టార్ ఇండియా రీసెర్చ్ అనలిస్ట్ మేనేజర్ మెల్విన్ పేర్కొన్నారు. పెద్ద ఈక్విటీ క్యాప్స్‌ల్లో నిధుల ఉపసంహరణ ఎక్కువగా ఉందన్నారు. 2022 నవంబర్ ముగింపు నాటికి మ్యూచువల్ ఫండ్లలో అసెట్ అండర్ మేనేజిమెంట్ (ఎయుఎం) దాదాపు రూ.40 లక్షల కోట్ల మైలురాయిని చేరడం విశేషం. అక్టోబర్‌లో ఇది రూ.39.50 లక్షల కోట్లుగా ఉంది. గడిచిన నెలలో సిప్‌ల్లో రూ.13,307 కోట్ల పెట్టుబడులు నమోదయ్యాయి. ఇంతక్రితం అక్టోబర్ నెలలో తొలిసారిగా సిప్ పెట్టుబడులు రూ.13,000 కోట్ల మార్కును దాటాయి.

వడ్డీ రేట్లు మళ్లీ పెంచితే మాంద్యం కోరలే

- యుఎస్ ఫెడ్‌కు ఎలన్ మస్క్ హెచ్చరిక

న్యూఢిల్లీ : అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరోమారు కీలక వడ్డీ రేట్లను పెంచితే ఆర్థిక మాంద్యం మరింత ఎగిసిపడనుందని టెస్లా, ట్విట్టర్ కంపెనీల అధినేత ఎలన్ మస్క్ హెచ్చరించారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యం దిశగా పయనిస్తోందని మస్క్ ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు. ఫెడ్ వడ్డీ రేట్లను పెంచడం ఇక ఆపాలని ఇటీవల ఆయన సూచించారు. అమెరికాలో తీవ్రమైన ఆర్థిక మాంద్యం తలెత్తక ముందే వడ్డీ రేట్లను తగ్గించాలన్నారు. ద్రవ్యోల్బణ కట్టడిలో భాగంగా ఫెడ్ ఇటీవల వరుసగా నాలుగోసారి 0.75 శాతం వడ్డీ రేటు పెంచింది. తుదగా నవంబర్‌లో పెంచిన రేట్లతో అమెరికాలో 3 నుంచి 3.25 శాతం మధ్య ఉన్న కనీస వడ్డీ రేటు 3.75 నుంచి 4 శాతానికి చేరింది. 2008 జనవరి తర్వాత అమెరికాలో వడ్డీరేట్లు ఇంత గరిష్ఠ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. ప్రస్తుత డిసెంబర్ సమీక్షలోనూ మరో 0.50 శాతం, వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి సమీక్షల్లో 0.25 శాతం చొప్పున పెంపు ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే కనీస వడ్డీ రేట్ల స్థాయి 5 శాతానికి చేరనున్నాయి.

ఎయిరిండియాకు 150 బోయింగ్ విమానాలు..!

ముంబయి : టాటా గ్రూపునకు చెందిన ఎయిరిండియా (ఎఐ) 150 బోయింగ్ 737 మాక్స్ జెట్స్‌ను కొనుగోలు చేయనుందని సమాచారం. దీనికి సంబంధించిన ఒప్పందాలను త్వరలోనే చేసుకోనుందని తెలుస్తోంది. ఎఐని టాటా గ్రూపు స్వాధీనం చేసుకున్న తర్వాత దాదాపు 50 బిలియన్ డాలర్ల మెగా ఆర్డర్లపై దృష్టి పెట్టిందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి.